# మట్టి తరలింపుని అడ్డుకున్న సర్పంచ్

మర్రిపాడు, మేజర్‌న్యూస్ :



మర్రిపాడు మండలంలోని కేతిగుంట పంచాయతీ పల్లిపాడు చెరువులో నుంచి అక్రమంగా తరలిస్తున్న మట్టిని ఆ పంచాయతీ సర్పంచ్ హరితేజ సోమవారం అడ్డుకున్నారు. అనంత సాగరం మండలం వెంగంపల్లి గ్రామానికి చెందిన కొంతమంది నాయకులు ట్రాక్టర్లు, జెసిబిలతో ఇలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న తరుణంలో సర్పంచి రంగంలోకి దిగి అడ్డుకొని ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారాన్ని అందించారు. దీంతో అధికారులు సర్పంచ్ హరితేజకు తరలించవద్దని ఆదేశాలిచ్చారు. దీంతో అక్రమ రవాణాను అడ్డుకొని అక్కడ నుంచి పంపించారు.

నేటి దినపత్రిక
సూర్య
17 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



# తరలుతున్న నల్ల బంగారం !

అసలే మెట్ట ప్రాంతం.. ఆపై దట్టమైన అడవులు.. ఎటు చూసినా అటవీ సంపదకు కరువు లేదు... ఇంకేముంది బొగ్గుబట్టీల వ్యాపారులకు మూడు పూలు ఆరు కాయలుగా మారింది. సంబంధిత అటవీశాఖ అధికారులను లోబర్చుకొని జోరుగా బొగ్గు వ్యాపారం సాగుతోంది. ఈ బొగ్గుబట్టీలతో కాలుష్య కోరల్లో గ్రామాలు కొట్టుమిట్టాడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో బొగ్గు వ్యాపారుల హవా.. నల్ల బంగారం ఎల్లలు దాటుతుంది. ఇదంతా జిల్లా సరిహద్దు ప్రాంతమైన మర్రిపాడు మండలంలో జరుగుతుంది.

మర్రిపాడు, మేజర్‌న్యూస్ :

- నిబంధనలకు తూట్లు
- గ్రామాలకు ఆనుకొని బొగ్గు బట్టీలు
- కాలుష్య కోరల్లో పల్లెలు
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు

జిల్లాలోని మర్రిపాడు మండలంలో బొగ్గు వ్యాపారం జోరుగా సాగుతోంది. అరాకొరగా అనుమతులు చేపట్టిన వ్యాపారస్తులు ఇష్టానుసారంగా బట్టీలను ఏర్పాటు చేసి నడిపిస్తున్నారు. ఆ బట్టీలు కూడా గ్రామాలకు ఆనుకొని ఉండడంతో పల్లెలు కాలుష్య కోరల్లో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ బొగ్గుబట్టీలు గ్రామాలకు రెండు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలంటే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కి గ్రామాలకు ఆనుకొని బట్టి ఏర్పాటు చేయడం వల్ల నిత్యం కాలుష్యంతో గ్రామాలు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా మండల పరిధిలోని చిలకపాడు పాత అల్లంపాడు భీమవరం నందవరం రాంపల్లి నాగరాజు పాడు కైదర ప్రాంతాల్లో ఈ బొగ్గుబట్టీల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఒక్కసారి ఈ బట్టలు సంద ర్శిస్తే ఎంత మాత్రం గ్రామాలకు దూరంగా ఉన్నాయనేది స్పష్టంగా అర్థం అవుతుంది. అంతేకాకుండా ఈ బట్టీలకు వాడేటటువంటి కర్ర అటవీ సంపద అవడం గమనార్హం. మర్రిపాడుకు సమీపంలో..

-మిగతా 2లో





## న్యూరోకేర్ యాప్‌ను ప్రారంభం



మైగ్రేన్‌తో బాధపడే రోగులకు న్యూరో కేర్ యాప్ ఎంతో ఉపయోగకరమని, ఆ యాప్ రోగులను నిత్యం పర్యవేక్షిస్తూ వారి యొక్క ఆరో గ్య సమాచారాన్ని సంభందిత వైద్యులకు చేరేవేస్తుందని నెల్లూరు అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ బింధు మీనన్ వెల్లడించారు. ప్రపంచ మెదడు దినోత్సవం సందర్భంగా నెల్లూ రు అపోలో హాస్పిటల్ లో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్యతో కలిసి బింధు మీనన్ న్యూరో కేర్ యాప్‌ను ప్రారంభించారు. - నెల్లూరు, మేజర్‌న్యూస్ :

4లో



## ఆగని అక్రమ మత్స్య వేట
# సరిహద్దుల్లో ఆట !



- అరికట్టేందుకు సిబ్బంది లేరు అంటున్న అధికారి
- అడ్డుకట్ట వేయాలని వేడుకుంటున్న జాలర్లు

భవిష్యత్తు జీవనోపాధి వారికి అవసరం లేదు, నిరుపేద జాలర్ల గోడు వారికి పట్టదు, వ్యాపారస్తుల స్వార్థపూరిత స్వలాభ ధనాపేక్ష శాపం అయింది, మన సరిహద్దు కాదు కదా అనే భావనలో ఉన్న జిల్లా అధికారుల నిర్లక్ష్యం వల్ల మత్స్య వేట అడ్డుగోలుగా సాగుతున్న వైనమిది.

అనంత సాగరం, మేజర్ న్యూస్ :

సోమశిల జలాశయంలో ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి యదేచ్ఛగా చేపలవేట నేటికీ కొనసాగుతోంది. ప్రాజెక్టు లోతట్టున నెల్లూరు జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఇబ్బడి ముబ్బడిగా తెప్పలతో పదుల సంఖ్యలో అక్రమ వేట జరుగుతోంది. స్థానిక వ్యాపారస్తులు కొందరు వారికి సహకరిస్తూ గుడ్డ చేపలను కొల్లగొడుతున్నారు. ఇదేమని..

-మిగతా 2లో



గేట్ల అతి సమీపాన వేట సాగిస్తున్న దృశ్యం

## కోలాహలంగా
# హనుమాన్ శోభాయాత్ర

- వేలాది మందితో బైక్ ర్యాలీ జైశ్రీరామ్.. జైహనుమాన్..
- నినాదాలతో దద్ధరిల్లిన ఆత్మకూరు పట్టణం

లోపల పేజీలో







# పడకేసిన పారిశుధ్యం

జలదంకి, మేజర్‌న్యూస్ : జలదంకి మండలం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ప్రజారోగ్యానికి కారణమైన పారిశుధ్యం నిల్వలు, ప్లాస్టిక్‌తో కూడిన చెత్తకుప్పలు తొలగించక ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. వ్యర్థాల్లో మురికి నీరు నిల్వలుండటంతో ఆ ప్రాంతంలో పలు జ్వరాలకు కారణమయ్యే దోమలు ఉత్పత్తి స్థావరాలుగా మారుతున్నాయి. జలదంకి పంచాయతీలోని పలు గ్రామల్లో రోడ్లపై మురికి నిలిచిపోవ డంతో రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారుతున్నాయి. అంతేకాకుండా దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. దీంతో ప్రజలకు విషజ్వరాలు సోకే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు తక్ష ణం స్పందించి శానిటేషన్ చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# పంచాయతీలో లక్షలు దోపిడీ

## ధ్వజమెత్తిన సర్పంచ్ లక్ష్మి, వార్డు సభ్యులు షఫీ ఉల్లా



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు గ్రామపంచాయతీలో గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు అవినీతి అక్రమాలు చేసి రూ.లక్షలు దోపిడీ చేశారని స్థానిక సర్పంచ్ బూదురు లక్ష్మి, వార్డు సభ్యులు షేక్ అబ్దుల్ షఫీ ఉల్లా ధ్వజ మెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తనకు తెలియకుండానే వైసీపీ నాయకులకు రూ.లక్షలు నిధులను అధికారులు చేశారని ఆమె ఆరోపించారు. ప్రతి విషయంలో కూడా పట్టించుకోలేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి నాయకులకు ఈ విషయాన్ని తెలియపరచినప్పటికీ పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని సర్పంచ్ తెలిపారు. అనంతరం వార్డు సభ్యులు షఫీ ఉల్లా మాట్లాడారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకుటూరు లక్ష్మణ్ రెడ్డిపై ఆయన విమర్శలు చేశారు. పంచాయతీలో చేసిన అక్రమాలకు ఆధారాలు ఉన్నాయని వార్డు సభ్యులు పేర్కొన్నారు. బిల్డింగ్ నిర్మాణానికి అనుమతులు ఎవరు అడ్డుకున్నారో.. అందరికీ తెలుసని వార్డు సభ్యులన్నారు. రూ.30 లక్షలు పంచాయతీ సొమ్ములు డ్రా చేసుకున్న విషయంపై సమాధానం చెప్పాలని వార్డు సభ్యులు ప్రశ్నించారు. అదేవిధంగా మరో రూ.10 లక్షలు ముత్యం గౌడ్‌కు డ్రా చేశారని వార్డు సభ్యులు తెలిపారు. ఈ విషయాన్ని అధికారులు, సర్పంచ్ మాట్లాడుకున్న ఫోన్ సంభాషణలు మీడియాకు వినిపించారు. అక్రమాస్తులపై బహిరంగ విచారణకు సిద్ధంగా ఉన్నామని వార్డు సభ్యులు సవాల్ చేశారు. అదేవిధంగా మాజీ మంత్రి కాకాణిగోవర్ధన్ రెడ్డి విమర్శలు మానుకోవాలన్నారు. సర్వేపల్లిలో చరిత్ర సమాప్తం అయినట్లు వార్డు సభ్యులు అన్నారు.

ఈ సమావేశంలో వార్డు సభ్యులు మణి, మహిళా నాయకులు, ముస్లిం మైనార్టీలు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు ముందస్తు చర్యలు చేపట్టాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం వున్నందున అన్ని ముందస్తు చర్యలు చేపట్టేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా వుండాలని జిల్లా కలెక్టరు ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షం రాకముందు, వచ్చిన తరువాత చేపట్టాల్సిన చర్యలపై పూర్తిగా సన్నద్ధత కావాలన్నారు. ప్రధానంగా ఇరిగేషన్, పంచాయతీ, రెవెన్యూ, విద్యుత్ శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువుల స్థితిగతులను పరిశీలించి అవసరమైన చోట చెరువు కట్టల మరమ్మతులు చేపట్టాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాల వల్ల ఎటువంటి ఇబ్బందులు వచ్చినా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, డిఆర్‌వో లవన్న, డిఎంఅండ్‌హెచ్‌వో పెంచలయ్య, ఇరిగేషన్, విద్యుత్, సోమశిల ఎస్ఇలు కృష్ణమోహన్, విజయన్, వెంకటరమణారెడ్డి, జడ్పీ సిఇవో కన్నమనాయుడు, ఉద్యానవన శాఖాధికారి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## ఆగని అక్రమ మత్స్య వేట.. సరిహద్దుల్లో ఆట !

*(మొదటి పేజీ తరువాయి)*

బడా వ్యాపారస్తులను ప్రశ్నించలేని స్థానిక నిరుపేద జాలర్లు మౌనంగా రోదించాల్సిన దుస్థితి. లోతట్టున పెన్నా పరివాహ ప్రాంతాల్లో స్థానికేతర జాలర్లకు నివాసాలు ఏర్పాటు చేసి కొందరు వ్యాపారస్తులు వారికి సకల సౌకర్యాలను, సరుకులను అందజేస్తున్నారు. స్థానిక వ్యాపారస్తులు రాత్రి వేళల్లో వేట చేయిస్తుండగా, నెల్లూరు, కడప జిల్లాల సరిహద్దుల్లో పట్టపగలే నిషేధిత వేట జోరుగా సాగిపోతోంది.



సోమశిల ప్రాజెక్టు సమీపాన రేపు వద్ద వేట సాగిస్తున్న దృశ్యం

### కుంట చెక్ పోస్టు మార్గాన చేపల తరలింపు :

జలాశయంలో పట్టిన చేపలను పలు వాహనాల్లో బద్వేల్ సమీపానగల కుంట చెక్ పోస్ట్ మీదుగా జిల్లాలకు, రాష్ట్రాలకు యదేచ్చగా జల పుష్పాలు తరలిపోతున్నాయి. వ్యాపారస్తులు లోతట్టు పెన్నా తీరాన గల గట్టుపల్లి, చర్చి మండి మునక ప్రాంతాలకు రోడ్డు మార్గాలను వేసుకొని పట్టిన చేపలను వాహనాల్లో తరలిస్తున్నారు. రాజంపేట ఏరియా ప్రాంతాలైన బెస్తపల్లి, మాదారం, ఇనగలూరు రూటు మీదుగా చేపల రవాణాను చేస్తున్నారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లోని కొండ తిప్పల వద్ద పదుల సంఖ్యలో స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు.సోమశిల కు చెందిన కొందరు వ్యాపారస్తులు, వారితో లోపాయకార ఒప్పందాలు చేసుకొని కమిషన్ల ప్రాతిపదికన దందా సాగిస్తున్నారు. జలాశయంలో నీటి నిల్వ అట్టడుగుకు ఉన్న పరిస్థితుల నేపథ్యంలో చేపలు వేట సులభతరం కావడంతో రోజుకి టన్నుల కొద్దీ.. గుడ్డు దశలో ఉన్న చేపలు మాయమవుతున్నాయి. చెక్‌పోస్ట్ వద్ద పోలీసు తనిఖీలు సక్రమంగా చేపట్టకపోవడం, లేక ముడుపుల మత్తులో చేపల అక్రమ రవాణా సాగుతుందన్న విమర్శలు తీవ్రంగా వినవస్తున్నాయి.

### నిరుపేద జాలర్ల మౌన రోదన :

కేవలం మత్స్య వేటపై ఆధారపడి జీవిస్తున్న నిరుపేద జాలర్లు ప్రస్తుత ఘోర పరిస్థితులను చూసి మిన్న కుండాల్సిన దుస్థితి ఏర్పడింది. దోపిడీదారులకు అధికారుల అండదండలు, స్థానిక నాయకుల భరోసాతో తమ భవిష్యత్తు జీవనోపాధికి స్వార్థపరులు విగాథం కలిగిస్తున్న ఏమి చేయలేని నిస్సహాయక స్థితిలో ఉన్నారు. తాము ఆకలి కేకలకు తట్టుకోలేక ఏటిలోకి విసురు వల వేసేందుకు వెళ్లినప్పుడు మాట వేసి అడ్డుకొని లైసెన్సులు రద్దు చేస్తాం, చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటాం అని బెదిరిస్తారని, కళ్ళ ముందు అంత అక్రమ వేట జరుగుతున్న వారిపై ఉదాశీనత ఎందుకు కనపరుస్తున్నారో ఆ రహస్యం ఏమిటో అర్థం కావటం లేదని ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ సమయాలలో మత్స్య శాఖ అధికారులు తరచూ జలాశయాన్ని సందర్శిస్తూ వస్తున్నారని ఇప్పుడు ఎప్పుడో గాని చుట్టము చూపుగా కూడా రానీ పరిస్థితి ఏర్పడిందని ఆరోపణలు వినవస్తున్నాయి.

### సిబ్బంది కొరతతో ఇబ్బందిగా ఉంది :

అక్రమ మత్స్య వేటపై ఆ శాఖ ఏడీ శ్రీనివాసులను గతంలో వివరణ కోరడం జరిగింది. అర్ధరాత్రిలో అక్రమ రవాణాను ఎలా అరికట్టగలమని, మీరే ఏం చేయాలో చెప్పమని ఆయన తిరిగి ప్రశ్న వేయడం జరిగింది.ప్రస్తుతం సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, స్థానికంగా ఉన్న మహిళా సిబ్బందితో పర్యవేక్షణ, నియంత్రణ, కట్టడి చేయలేకున్నామని గతంలో తెలిపారు.

## తరలుతున్న నల్ల బంగారం !

*(మొదటి పేజీ తరువాయి)*

దట్టమైన అడవులు ఉండడంతో రహస్య ప్రదేశాల నుంచి బట్టీలకు అడవి కరణ ఉపయోగిస్తున్నారని ఆయా గ్రామాల గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీటితో పాటుగా వేప, నల్లతుమ్మ, తెల్ల తుమ్మ కర్రను కూడా ఉపయోగిస్తున్నారు. ఈ బొగ్గుబట్టీలకు సంబంధించి ఏ కర్రను వాడాలో, ఏ కర్రను వాడకూడదన్న సమాచారం కూడా ప్రజలకు తెలియకపోవడంతో వ్యాపారస్తులు 'ఆడిందే ఆటగా పాడిందే పాట'గా తయారవుతుంది. ముఖ్యంగా చిలకపాడు పంచాయతీ చుట్టూ నాలుగు నుంచి ఐదు బడ్డీలు వరకు ఉండడంతో ఆ గ్రామాల ప్రజల ఆవేదన అంతా ఇంతా కాదు. ఈ నల్ల బంగారానికి అధిక ధర పలుకుతుండడంతో రాత్రి సమయాల్లో లారీలతో ఎల్లలు దాటిచ్చేస్తున్నారు. సంబంధిత అటవీ శాఖ అధికారులు మాత్రం మామూలు మత్తులో ఉన్నారనేది సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని నిబంధనలకు తూట్లు పొడిచే ఈ బొగ్గు వ్యాపారాన్ని అరికట్టాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

## నిర్భయంగా ఫిర్యాదు చేయండి

### న్యాయం చేస్తాం : జిల్లా ఎస్పీ కృష్ణకాంత్



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** మీ సమస్యలపై నిర్భయంగా తనకు తెలియజేయాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బ్రెయిన్ కాపిటల్ కంపెనీ అనే నకిలీ సంస్థ లో వాటా పేరుతో కోటి ఎనభై లక్షలు నగదు తీసుకొని మోసం చేసిన వారి పై చర్యలు తీసుకొని మా డబ్బులు తిరిగి ఇప్పించాలని వేదాయపాలెంనకు చెందిన ఆవుల కార్తీక్ ఫిర్యాదు చేసారనీ, అధిక కట్నం కోసం, అత్త, మామ, భర్త వేధింపులకు గురి చేస్తున్నారు అనే విషయమై నెల్లూరు సిటీకు చెందిన మహిళ ఫిర్యాదు చేసారని, దివ్యాంగురాలను ప్రేమ పేరుతో మోసం చేసి, పెళ్ళికి నిరాకరించిన ఉలవపాడు మండలానికి చెందిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసారని, హత్యాయత్నం కేసులో ముద్దాయిపై త్వరితగతిన చర్యల కొరకు నవాబ్ పేటకు చెందిన వ్యక్తి ఫిర్యాదు చేసారని, భర్త మరణాంతరం భర్తకు సంబంధించిన ఆస్థి విషయమై అత్తింటివారి వేధింపుల గురించి నెల్లూరు రూరల్ పరిధికి చెందిన మహిళ ఫిర్యాదు చేసారనీ, 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరిత గతిన పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

## కార్పొరేషన్ ఆరోగ్యశాఖ అధికారి మాతృ శాఖకు బదిలీ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు కార్పొరేషన్ ఎంహెచ్ఓ వెంకటరమణ మాతృ శాఖకు బదిలీ చేశారు. ఈ మేరకు అధికారికంగా మున్సిపల్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు గతంలో ఆయన ఒక హోటల్‌పై దాడి చేశారు. దీంతో ఆ హోటల్ యాజ మాన్యం హెల్త్ అధికారి తన పరిధికి మించి దాడులు నిర్వహిస్తున్నారని మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు దీంతో మున్సిపల్ అధికారులు హెల్త్ అధికారికి సంబంధించి ఈ నిర్ణయం తీసుకున్నారు. నూతన మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ అధికారి రేసులో పలువురు ఉన్నట్లు సమాచారం.

# ఆత్మకూరులో కోలాహలంగా హనుమాన్ శోభాయాత్ర

- వేలాదిమందితో బైక్‌ర్యాలీ
- జైశ్రీరామ్, జైహనుమాన్ నినాదాలతో దద్ధరిల్లిన పట్టణం
- ఎటుచూసినా కాషాయమయం





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో ఆదివారం అత్యంత ఘనంగా, కోలాహలంగా భారీ ఎత్తున శ్రీశ్రీశ్రీ హనుమాన్ శోభాయాత్రా కార్యక్రమాన్ని భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. యాత్ర నిర్వహణకోసం ఉత్సవకమిటీ ప్రతినిధులు, భక్తులు 10రోజులుగా పట్టణంలోని వాడవాడలా, నియోజకవర్గంలోని ఆత్మకూరు, చేజర్ల, అనంతసాగరం, మర్రిపాడు, సంగం, ఏఎస్‌పేట మండలాల్లో ముమ్మరంగా పర్యటించి అందరూ పాల్గొనాలని ఆహ్వానించారు. పట్టణమంతా ఫ్లెక్సీలు, కాషాయజెండాలతో రెపరెపలాడించారు. ఆదివారం మధ్యాహ్నం నెల్లూరు-ముంబాయి రహదారిపై ఆత్మకూరు బైపాస్‌రోడ్డు జంక్షన్‌లోని శ్రీశ్రీశ్రీ అభయాంజనేయస్వామి వారి ఆలయం వద్ద నుండి పట్టణంలోని రవితేజ కళ్యాణమండపం వద్దకు చేరుకొని అక్కడ ప్రత్యేక పూజలనంతరం శోభాయాత్ర ప్రారంభించారు. వేలాదిమంది వయోబేధం, పార్టీలు, కులమతాలకతీతంగా హిందువులు మోటర్‌సైకిళ్ళపై సాంప్రదాయ కాషాయదుస్తులు, టోపీలు, జెండాలతో శోభాయాత్రలో పాల్గొన్నారు. ముందుబాగాన గుర్రాల రథంపై శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయుడు విగ్రహాలను, చిన్నారుల వేషధారణలను ఏర్పాటు చేసి కొనసాగించారు. అడుగడుగునా కోలాహలంగా పెద్దఎత్తున కోలాటాలు, డిజె సౌండ్‌లతో బాణాసంచా మోతలతో శోభాయాత్రను సాగించగా అడుగడుగునా భవంతులపైన చేరిన పలువురు యాత్రలోని వారిపై పూలవర్షం కురిపించ సాగారు. రవితేజ కళ్యాణ మండపం వద్ద నుండి త్రికోటేశ్వర కళ్యాణమండపం, వైశ్యాబజార్, సత్రంసెంటర్, మేదరవీధి, కృష్ణమందిరం సెంటర్, ఏకలవ్య నగర్‌ల మీదుగా సోమశిలరోడ్డు సెంటర్‌కు చేరుకొని అక్కడ నుండి ఎల్‌ఆర్‌పల్లి మీదుగా స్పార్క్ సిటి వద్దకెళ్ళి అక్కడ నుండి ఎల్‌ఆర్‌పల్లి, బిఎస్‌ఆర్ సెంటర్, జె.ఆర్.పేట, మున్సిపల్ బస్టాండులమీదుగా రవితేజ కళ్యాణమండపం వద్ద ముగించారు. పట్టణమంతా కాషాయమయం కావడంతోపాటు జైశ్రీరామ్, జైహనుమాన్ అంటూ నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. ఈ శోభాయాత్రను అత్యంత భక్తిశ్రద్ధలతో అందరి మేలుకోరుతూ నిర్వహించారు. వేలాది మందికి స్థానిక శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్, నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి అత్యంత రుచికరమైన అన్న ప్రసాదవితరణ గావించారు. ఈ యాత్రను వీధులవెంబడి అందరూ తమ ఇళ్ళవద్ద చేరుకొని తిలకించసాగారు. యాత్రలో స్వాముల విగ్రహాలకు నైవేద్యాలు సమర్పించారు. ఈయాత్రలో ఆత్మకూరు పట్టణం, ఆత్మకూరు, ఏఎస్‌పేట, అనంతసాగరం, మర్రిపాడు, సంగం, చేజర్ల తదితర మండలాలకు చెందిన హిందువులు పాల్గొన్నారు.



# నేటిబాలలే రేపటి భావిభారతపౌరులు - ఉపవిద్యాశాఖాధికారి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నేటి బాలలే రేపటి భావి భారతపౌరులని ఆత్మకూరు ఉప విద్యాశాఖాధికారి కె.గోపాల్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని సోమవారం ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గోపాల్ ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనంతలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న డిప్యుటి డీఈఓ గోపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏడు రోజులపాటు శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా వివిద కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు శ్రద్దాసక్తులతో చదివి నైపుణ్యాలు పొంది ఉజ్వలభవిష్యత్తు పొందాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన వివిద నమూనాలను ఆయన నిశితంగా పరిశీలించి వారి మేధాసంపత్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్‌కమిటీ చైర్మన్ ఒంటేరు మల్లికార్జున, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులలో అభ్యసన మెరుగుపడాలి : ఎంఈఓ-2



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** విద్యార్థిని విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడాలని ఎంఈఓ-2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి సూచించారు. మండలంలోని మంగుపల్లి, బొమ్మ వరం, అగ్రహారం, చిలకలమర్రిలోని పలు పాఠశాలలను ఆయన సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులను జ్ఞాన ఆధారిత ప్రశ్నలను అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల వర్క్ బుక్ లను పరిశీలించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులలో ఎల్ఎస్ ఆర్‌డబ్ల్యు నైపుణ్యాలు వృద్ధి చెందేల అభ్యాసాలను ఇంటి పనిగా ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠ్యపుస్తకాలు, స్టూడెంట్ కిడ్స్ సరఫరా సమగ్రతపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల టిఎల్ఎం ప్రదర్శనను తిలకించి వారిని అభినందించారు.

## కౌలు రైతు తప్పక పంటసాగు పత్రాలు పొందాలి : ఏఓ



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** కౌలు రైతులు తప్పకుండా పంట సాగు హక్కు పత్రాలను పొంది ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శ్రీనివాస చక్రవర్తి అన్నారు. మండలంలోని ఉప్పలపాడు, కామిరెడ్డిపాడు గ్రామాలలో సోమవారం రైతుల కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్లైన్ లో ఈ క్రాఫ్ నమోదు చేసుకోవాలని తద్వారా ఇన్సెంట్ సబ్సిడీ, ఇతర పంటల రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అన్ని రకాల పంటలకు భీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ పి.వెంకటసుబ్బయ్య, వీఆర్వో మౌనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** మండలంలో విద్యుత్ శాఖ అధికారులు ఆకస్మి తనిఖీలు నిర్వహించారు. గృహాలు, వ్యాపార దుకాణాలకు సంబంధించి విద్యుత్ పెండింగ్ బిల్లులను చెల్లించని వినియోగదారులకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించక పోతే సర్వీసులను తొలగిస్తామని అధికారులు సూచించారు. కరెంట్ బిల్లులను చెల్లించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ సైట్‌లలో గాని యాప్‌లలో కానీ చెల్లించవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో జలదంకి జేఈ చంద్ర వారి సిబ్బంది పాల్గొన్నారు.

## జలదంకిలో గుర్తు తెలియని యాచకుడు మృతి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండల కేంద్రంలోని బస్టాండ్‌లో గుర్తు తెలియని యాచకుడు మృతి చెందాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు, పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించారు. పంచాయతీ కార్యదర్శి ఖాజా మొహిద్దీన్, పోలీస్ కానిస్టేబుల్ రాము శ్రీనివాసులు మృతదేహాన్ని పరిశీలించి మృతులకు ఎవరు లేకపోవడంతో జలదంకి హిందూ స్మశాన వాటిక తీసుకుని వెళ్లి మృతదేహాన్ని పూడ్చి చేశారు.

## న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి సీనీయర్ సివిల్ జడ్జి ఎం.శోభ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికారిక సంస్థ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబర్, న్యాయ వాది ఇసకల సాయి ప్రసాద్ మాట్లాడుతూ.. వాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ వాడకం వల్ల ప్రాణ రక్షణ, మరియు తలకు గాయాలు వంటి వాటిని రక్షించు కోవచ్చు అని, అలా బైక్‌లపై వెళ్లే వారు హెల్మెట్ ధరించాలని లేనియెడల జరిమానా విధిస్తారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు ఆర్.సాయిక్రిష్ట, కె.చంద్రశేఖర్‌రెడ్డి, లోక్ అదాలత్ మెంబర్ యం.మాలకొండా రెడ్డి ప్రయాణికులు స్టూడెంట్ప్ పాల్గొన్నారు.

# న్యూరో కేర్ యాప్‌ను ప్రారంభించిన డాక్టర్ బింధుమీనన్




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మైగ్రేన్‌తో బాధపడే రోగులకు న్యూరో కేర్ యాప్ ఎంతో ఉపయోగ కరమని, ఆ యాప్ రోగులను నిత్యం పర్యవేక్షిస్తూ వారి యొక్క ఆరోగ్య సమాచారాన్ని సంభందిత వైద్యులకు చేరేవేస్తుందని నెల్లూరు అపోలో స్పెషా లిటీ హాస్పిటల్ సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ బింధు మీనన్ వెల్లడించారు. ప్రపంచ మెదడు దినోత్సవం సందర్భంగా నెల్లూరు అపోలో హాస్పి టల్‌లో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్యతో కలిసి బింధు మీనన్ న్యూరో కేర్ యాప్‌ను ప్రారంభించారు. ఈ సంద ర్భంగా డాక్టర్ బింధు మీనన్ మాట్లాడుతూ.. ప్రపంచ మెదడు దినోత్సవంలో భాగంగా ఈ ఏడాది మెదడు ఆరోగ్యం, నరాల సంభందిత రుగ్మతల నివారణ అనే థీమ్ తో వివిధ కార్యక్ర మాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ న్యూరాలజీతో కలిసి మెదడు, నరాల రుగ్మతల గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు కార్యక్రమాలు నిర్వహి స్తామన్నారు. ఇందులో భాగంగా వివేకానంద ఎడ్యుకేషన్ సొసైటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఈఎస్ఐటీ) పరిశోధన బృందంతో కలిసి న్యూరోకేర్ యాప్‌ను రూపొందించామన్నారు. మైగ్రేన్ రోగులు, న్యూరాలజీ వైద్యుల మధ్య కమ్యూనికేషన్‌ను ఈ మొబైల్ యాప్ పెంపొందిస్తుందని డాక్టర్ బింధు మీనన్ తెలియజేశారు. మైగ్రేన్ రోగులు ఈ యాప్‌లో బటన్ నొక్కడం ద్వారా వారి పూర్తి సమాచారం ఎప్పటికప్పుడు వైద్యులకు తెలిస్తుందని దానికి అనుగుణంగా వైద్యులు అప్రమత్తమయ్యి, వారికి సరైన వైద్యం సకాలంలో అందించగలుగుతారని పేర్కొన్నారు. అంతే కాకుండా రోగికి ప్రతీ రోజూ వారి దిన చర్యను తెలియజేయడమే కాకుండా చిట్కాలను కూడా తెలియజేస్తుందన్నారు. మైగ్రేన్ బాధితుల జీవితాలను మెరుగుపరచడమే న్యూరో కేర్ యాప్ యొక్క లక్ష్యమని డాక్టర్ బింధు మీనన్ మీడియాకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో న్యూరో ఫిజీషియన్లు డాక్టర్ రశ్మి, డాక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

# సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

## పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలు చెల్లించాలి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో పారిశు ద్ధ కార్మికులకు రావాల్సిన సమ్మె కాలం 16 రోజుల జీతం, జనవరి ఫిబ్రవరి నెల హెల్త్ అలవెన్స్ డైలీ కార్మికులకు మూడు నెలలుగా రావాల్సిన జీతాలు ఇవ్వాలని సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో కావలి మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ప్రజా విజ్ఞప్తుల సేకరణ సందర్భంగా కమిషనర్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్. రెహానార్ బేగం మాట్లాడుతూ.. కార్మికులకు గత సంవత్సరం సమ్మె కాలం 16 రోజులు జీతాన్ని రెండు నెలల అలవెన్స్‌ను ఏడు నెలలు దాటుతున్నప్పటికీ కార్మికులకు చెల్లించవలసిన బకాయిలు చెల్లించలేదని ఇది చాలా అన్యాయం అని ఆరు ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ, ఉన్న వారికి సక్రమంగా జీతాలు ఇవ్వకపోవడం చాలా బాధాకరమని వారు తెలిపారు. అధికారులు దీన్ని గుర్తించి ప్రతి నెల జీతాలు సకాలంలో ఇచ్చి పెండింగ్ బకాయిలను చెల్లించాలని, కార్మికుల్లో ఆరోగ్యంగా ఆకలి బాధలు లేకుండా ఉండే విధంగా చూడాలని ఆమె డిమాండ్ చేశారు. పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ, డైలీ కార్మికులకు మూడు నెలల జీతాలు ఇవ్వాల్సి ఉందని, ప్రతినెల జీతాలు ఇవ్వకుండా కార్మికులు ఇబ్బందులు గురిచేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని తెలిపారు. కార్మికులకు అవసరమైన పనిముట్లు రక్షణ పరికరాలు సక్రమంగా ఇవ్వలేదని తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కమిషనర్ ఎండనే జోక్యం చేసుకొని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, పరుసుజేమ్స్ కే.బాబు, క్రాంతి కుమార్ మహిళా నాయకులు అనిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# కృత్యాల ద్వారా సులభతర బోధన




**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** విద్యార్థులకు బోధనాభ్యసన కృత్యాల ద్వారా ఆసక్తికరంగా, సులభతరంగా బోధించవచ్చని మండల విద్యాశాఖాధికారులు ఎం.దిలీప్ కుమార్, పి.వి. రత్నం అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం మండలంలో సోమవారం నుండి ప్రారంభమైన 'శిక్ష సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా రామచంద్రా పురం ప్రాథమికోన్నత పాఠశాల, జొన్నవాడ, రెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. జాతీయ విద్యా విధానం-2020 4వ వార్షికోత్సవ సందర్భంగా నేటి నుండి 29వ వరకు పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న పునాది అక్షరాస్యత, గణితం, 24న క్రీడా దినోత్సవం, 25న సాంస్కృ తిక కార్యక్రమాలు, 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, 27న పర్యా వరణ పరిరక్షణలో భాగంగా అమ్మ పేరిట మొక్కలు నాటడం, 29న సమాజ భాగస్వామ్య దినోత్సవం, ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో బోధనాభ్యసన సామాగ్రి ప్రదర్శనను, మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అభ్యసన సామాగ్రిని ఉపయోగించి ఉపాధ్యాయులు పాఠం చెప్పడం వలన విద్యార్థులకు ఎక్కువకాలం గుర్తుండిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు రెడ్డి, జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఉర్దూ డీఐ సందర్శన :** మండలంలోని దామరమడుగు ఉర్దూ, బుచ్చి ఉర్దూ బాయ్స్ పాఠశాలలను సోమవారం ఉర్దూ డిఐ షేక్ ఖాజా మొహిద్దీన్ సందర్శించి ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు తయారు చేసిన బోధనాభ్యసన సామాగ్రి ప్రదర్శనను తిలకించారు. శిక్ష సప్తాహ్‌లో భాగంగా రోజువారి కార్యక్రమ వివరాలను వివరించి ప్రతిరోజు పాఠశాలల్లో అమలు చేయాలని తెలిపారు.

## ఠాగూర్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని ఠాగూర్ మీడియం పాఠశాలలో అమ్మ పేరుతో మొక్కలు నాటడం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పాఠశాల కరస్పాం డెంట్ సిహెచ్ వెంకటరమణారెడ్డి ప్రధానోపాధ్యాయులు కె.దొరస్వామి రెడ్డిల ఆధ్వర్యంలో అమ్మ పేరుతో మొక్కలు నాటడం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఇంటి ఆవరణలో చెట్లను పెంచాలని కోరారు చెట్లను కాపాడు కుంటే అవి మనల్ని కాపాడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిందితునికి జైలుశిక్ష

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో నేరం రుజువు కావడంతో నిందితునికి ఆరు నెలల పాటు జైలుశిక్ష రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి జే.అంజయ్య సోమవారం తీర్పు ఇచ్చారు. వివరాల మేరకు. 31.5.2016న చేజర్ల మండలం కొల్లపునాయుడుపల్లికి చెందిన రావిళ్ల శివరామయ్య, ఆత్మకూ రు మండలం చెర్లోయడవల్లికి చెందిన పెట్లూరి కౌశిక్లు మండలంలోని వెంకటంపేట వద్ద జరుగుతున్న ఆంజనేయస్వామి ఉత్సవాలకు వచ్చి తిరిగి వెళుతున్నారు. ఈ క్రమంలో దుత్తలూరు నుంచి కడప జిల్లా బద్వేల్కు బొగ్గు లోడుతో వెళుతున్న లారీ దూత్తలురు మండలంలోని నందిపాడు సెంటర్లో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ ఘటనపై అప్పట్లో కేసు నమోదైంది. విచారణలో డ్రైవర్ గజ్జి రాజేష్ అతివేగంగా వాహనాన్ని నడిపి వారి మృతికి కారణమయ్యారని నేరం రుజువైంది. దీంతో న్యాయాధికారి వైవిధంగా తీర్పు ఇచ్చారు. ఈ కేసును కోర్టు ఏపీపీ సుకన్య వాదించగా, కోర్టు కానిస్టేబుల్ ప్రవీణ్విజయ్ సాక్షులను ప్రవేశపెట్టి సాక్ష్యం చెప్పించడంతో నిందితునికి జైలుశిక్ష ఖరారైంది.

## పంచాయతీల అభివృద్ధికి గ్రామ సభలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని దాసరిపల్లి అప్పసముద్రం పుల్లాయపల్లి పంచాయతీ కార్యాలయాల్లో సోమవారం గ్రామసభలు నిర్వ హించారు. సర్పంచులు కల్లూరి శ్యామలాదేవి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభల్లో పంచాయతీలలోని గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జలజీవన్ మిషన్ స్వచ్ఛభారత్ పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ కార్య క్రమంలో పంచాయతీ కార్యదర్శులు కరీముల్లా, తేజ, చంద్రశేఖర్ రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆనంకు అభినందన తెలిపిన విద్యార్థులు

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని చుంచులూరు పడమటి నాయుడు పల్లి పంచాయతీలో ఉన్నటువంటి విద్యార్థులు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఆ రెండు పంచాయతీల్లోని విద్యార్థులు మండల కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మండల పరిధిలోని నందవరం ఆదర్శ పాఠశాలలో దాదాపుగా 70మంది విద్యను అభ్యసిస్తున్నారు. ఈ తరుణంలో ఆర్టీసీ బస్సు లేక సంవత్సరం రోజుల నుంచి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఎన్టీఆర్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆనంను కలిసి తన గోడును విన్నవించుకున్నారు. తప్పకుండా బస్సు సౌకర్యం కల్పించి ఇబ్బందులు తొలగిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం బస్సు సౌకర్యం కల్పించడంతోపాటు సోమవారం బస్సును నడపడంతో ఆయనకు అభినందనలు తెలిపారు. దీంతోపాటుగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు.



# నిర్ణీత సమయంలో ప్రజా సమస్యలను పరిష్కరించండి



## ▸ అదనపు కమిషనర్ శర్మద

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను (పీజీఆర్ఎస్) నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శర్మద పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆక్రమణలు, అనధికార కట్టడములు, కాలువల పూడికలు, ఆస్తి పన్నులకు సంభందించిన అంశాలపై ప్రజల నుంచి అందుకున్న సమస్యలకు సత్వరమే పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గృహాలలో సెప్టిక్ ట్యాంకులను 3 సంవత్సరాలకు ఒకసారి శుభ్రం చేసుకునేలా ప్రజలలో అవగాహన కల్పించేందుకు స్థానిక ఆమెనిటీ కార్యదర్శులు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటుతో పాటు ఇంటింటి ప్రచారంతో అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలపు సమస్యలను అధిగమించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, అండర్ బ్రిడ్జిలలో వర్షపు నీరు నిలవ కుండా తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. అన్ని డ్రైను కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను చేపట్టాలని సూచించారు. పెండింగులో ఉన్న ఫిర్యాదుల స్థితిగతులపై విభాగాల వారీగా అధికారులతో సమీక్షించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుతం అందుకున్న వినతులు పునరావృతం కాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో శాశ్వత పరిష్కారం అందించాలని అదనపు కమిషనర్ సంబంధిత సెక్షన్ అధికారులకు సూచించారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్-06, టౌన్ ప్లానింగ్-08, పబ్లిక్ హెల్త్-02, రెవెన్యూశాఖ - 01, ఆఫ్కాస్ -03 మొత్తం -20 ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ ఎస్ఈ సంపత్ కుమార్, మేనేజర్ ఇనాయతుల్లా ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరెంటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# కొణిదల నాగబాబుని కలిసిన జనసేన నాయకులు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో జాతీయ మీడియా ప్రతినిధి జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ సమక్షంలో జనసేన జిల్లా నాయకులు గునుకుల కిషోర్ వారిసతీమణి విజయలక్ష్మి జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ కార్యాలయం ఇన్‌చార్జ్ జమీర్ శ్రీరామ్ గుర్రం కిషోర్ హరి శేఖర్ కోల విజయలక్ష్మి ప్రశాంత్ గౌడ్ మురళి నాగిశెట్టి వారి సతీమణి కుమార్తె ఈ రోజు ప్రధాన కార్యదర్శి నాగబాబుని కలిశారు. జెండా పట్టి నడిచిన కార్యకర్తలు శ్రేయస్సు కోసం ప్రతిష్టాత్మకంగా అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రారంభించబడిన క్రియాశీలక సభ్యత్వం మహాయజ్ఞంలా ముందుకు తీసుకువెళ్లాలని నిన్నటి రోజున క్రియాశీలకు సభ్యత్వం చేసుకొని దురదృష్టవశాత్తు కుటుంబ పెద్దలను కోల్పోయిన కుటుంబాలకు జనసేన పార్టీ తరఫున సాయంగా ఒక ఐదు లక్షల రూపాయలు ఇస్తుంటే వారి బాధని తీర్చలేక పోయినా ఈ సాయం వారికెంతో ఉపయోగ పడుతుంది మనం చేసే ఈ ప్రయత్నం మన కార్యకర్తల కుటుంబాలకు ఎంతగానో ఉపయోగ పడుతుంది అందరూ కష్టపడి సభ్యత్వం నమోదు చేయాలి జిల్లాలో రెన్యువల్స్, కొత్త సభ్యత్వాలు ఎక్కువ సంఖ్యలో సాధించాలని తెలిపారు.

# పంచాయతీలో లక్షలు దోపిడీ

## ధ్వజమెత్తిన సర్పంచ్ లక్ష్మి, వార్డు సభ్యులు షఫీ ఉల్లా



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు గ్రామపంచాయతీలో గత ప్రభుత్వ హయాం నందు వైసిపి నాయకులు అవినీతి అక్రమాలు చేసి లక్షల రూపాయలు దోపిడీ చేశారని స్థానిక సర్పంచ్ బూదురు లక్ష్మి, వార్డు సభ్యులు షేక్ అబ్దుల్ షఫీ ఉల్లా ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్ నందు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. తనకు తెలియకుండానే వైసీపీ నాయకులకు లక్షల రూపాయలు నిధులను అధికారులు చేశారని ఆమె ఆరోపించారు. ప్రతి విషయంలో కూడా పట్టించుకోలేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి నాయకులకు ఈ విషయాన్ని తెలియపరచినప్పటికీ పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని సర్పంచ్ తెలిపారు. అనంతరం వార్డు సభ్యులు షఫీ ఉల్లా మాట్లాడారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకుటూరు లక్ష్మణ్ రెడ్డిపై ఆయన విమర్శలు చేశారు. పంచాయతిలో చేసిన అక్రమాలకు ఆధారాలు ఉన్నాయని వార్డు సభ్యులు పేర్కొన్నారు. బిల్డింగ్ నిర్మాణానికి అనుమతులు ఎవరు అడ్డుకున్నారో అందరికీ తెలుసని వార్డు సభ్యులు అన్నారు. 30 లక్షల రూపాయలు పంచాయతి సొమ్ములు డ్రా చేసుకున్న విషయంపై సమాధానం చెప్పాలని వార్డు సభ్యులు ప్రశ్నించారు. అదేవిధంగా మరో 10 లక్షల రూపాయలు ముత్యం గౌడ్ కు డ్రా చేశారని వార్డు సభ్యులు తెలిపారు. ఈ విషయాన్ని అధికారులు, సర్పంచ్ మాట్లాడుకున్న ఫోన్ సంభాషణలు మీడియాకు వినిపించారు. అక్రమాస్తులపై బహిరంగ విచారణకు సిద్ధంగా ఉన్నామని వార్డు సభ్యులు సవాల్ చేశారు. అదేవిధంగా మాజీ మంత్రి కాకాణిగోవర్ధన్ రెడ్డి విమర్శలు మానుకోవాలన్నారు. సర్వేపల్లిలో చరిత్ర సమాప్తం అయినట్లు వార్డు సభ్యులు అన్నారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు మణి, మహిళా నాయకులు, ముస్లిం మైనార్టీలు తదితరులు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలనకు విద్య, వైద్యం ముఖ్యం

- విద్యార్థులకు పుస్తకాల పంపిణీ
- విద్యార్థుల రవాణాకు 50వేల విరాళం
- నిత్యాన్నదాత 'కంచి'



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలో పేదరికం తొలగాలంటే విద్య, వైద్యం ప్రధానమని శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, నిత్యాన్నదాత కంచి పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు మండలం, చెర్లో ఎడవల్లి గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు బస్సు వసతి లేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకొని సంవత్సరానికి ఆటోకు అయ్యే రవాణా చార్జీలు 50,000 రూపాయలు విరాళం అందజేశారు. శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత నిత్య అన్నదాత శ్రీ కంచి పరమేశ్వర్ రెడ్డి ఆత్మకూరులో అనేక సామాజికసేవా కార్యక్రమాలు స్వంత నిధులతో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. చెర్లో ఎడవల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు అల్లంపాటి రాజేష్ రెడ్డి మరియు మిత్ర బృందం కలిసి 2016 సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసి ముఖ్యఅతిథిగా శ్రీ సాంబశివా చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వర్ రెడ్డిని, మండలాధ్యక్షులు కేతా వేణుగోపాల్ రెడ్డి, చెర్లో ఎడవల్లి గ్రామ మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్ రెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుముల సుధాకర్ రెడ్డి, మల్లవరపు జయంద్ర ప్రసాద్ రెడ్డి, టిడిపి నాయకులు గుండాల బుజ్జి రెడ్డి, సూరా భాస్కర్ రెడ్డి, చెర్లో ఎడవల్లి గ్రామ పెద్దలు అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన కంచి పరమేశ్వర్ రెడ్డికి రాజేష్ వారి బృందం, ఆ పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఆ గ్రామస్తులు, ఉపాధ్యాయులు వారికి ఘన స్వాగతం పలికారు. సభను అలంకరించిన పెద్దలు మాట్లాడుతూ ఈ పాఠశాల రెండుసార్లు స్వచ్ఛభారత్ జాతీయ పురస్కారం అందుకోవడం దానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ మనిషికి అన్నము ఎంత ముఖ్యమో విద్య కూడా అంతే ముఖ్యము అని భావించే వ్యక్తి నిత్య అన్నదాత శ్రీ కంచి పరమేశ్వర్ రెడ్డి అని, ఆయన మన ప్రాంతంలో చేస్తున్న అనేక కార్యక్రమాలలో ఈ మధ్యకాలంలో అన్నదానానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో అంతే ప్రాధాన్యత విద్యకు కూడా ఇవ్వడం చాలా అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈరోజు పాఠశాల విద్యార్థులు నాగులపాడు, నారంపేట నుంచి బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా విద్యార్థుల రవాణాకు అయ్యే ఖర్చు మొత్తం సంవత్సరానికి తానే అందిస్తానని మాట ఇచ్చి 50వేల రూపాయల నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయినికి అందజేయడం జరిగింది. కంచి చేస్తున్న ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రతి పేదవారి కుటుంబాలలో వెలుగుని నింపుతూ వారి బాధను తీర్చి దానిలో సంతోషం వెతుక్కుంటున్న మహా మనిషి శ్రీ కంచి పరమేశ్వర్ రెడ్డి అని కొనియాడారు. కంచి పరమేశ్వర్ రెడ్డిని ముందుగా మండల అధ్యక్షులు కేత వేణుగోపాల్ రెడ్డి, చెర్లో ఎడవల్లి గ్రామం మాజీ సర్పంచ్ కేత విజయభాస్కర్ రెడ్డి, సభను అలంకరించిన గ్రామ పెద్దలు రాజేష్ వారి మిత్ర బృందానికి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులకు హృదయపూర్వక అభినందనలు, విద్యార్థులకు ఆశీస్సులు తెలియజేసిన పరమేశ్వర రెడ్డి ఒక మంచి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేయడం చాలా సంతోషంగా ఉందని, రాజేష్ వారి మిత్రబృందం గత ఏడు సంవత్సరాల నుంచి విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాలు చేయడం హర్షదాయకమని కంచి పేర్కొన్నారు. ఇంత చక్కటి కార్యక్రమంలో నాగులపాడు, నారంపేట గ్రామ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులకు గాను వారి రవాణా ఖర్చులకు అయ్యే విరాళం ఈ కార్యక్రమంలో ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మీ గ్రామానికి, ఉపాధ్యాయులకు, మీ తల్లిదండ్రులకు మంచి పేరుని తీసుకువచ్చి ప్రతి ఒక్కరికి ఆదర్శంగా ఉండాలని ఆకాంక్షించారు. పదవ తరగతి విద్యార్థులకు చివరి ఆరు నెలలు స్టడీ అవర్స్ లో స్నాక్స్ ఇచ్చేందుకు ప్రతినెల 5వేల రూపాయలు అలాగా 6 నెలలు అందిస్తానని ఆయన తెలియజేశారు. దాంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా సంతోషించి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

దేశంలో పేదరికం నశించాలి అంటే విద్య మరొకటి వైద్యం అని, ఈ రెండు ఉచితం చేస్తే దేశంలో పేదరికం అనేదే కనిపించదని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు కేతా వేణుగోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్, మండల తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి కేతా విజయభాస్కర్ రెడ్డి, రాజేష్ వారి బృందం, భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు కంచి పరమేశ్వర్ రెడ్డిని శాలువాతో, గజ మాలతో ఘనంగా సన్మానించారు.



# ఆత్మకూరులో వైద్యశాల..

# స్థాయి బారెడు.. సేవలు జానెడు




- అమలుకాని మంత్రి హామీలు
- వైద్యుల, సిబ్బంది కొరత

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో గతంలో 30పడకల హాస్పిటల్ ఉంటూ సక్రమంగా వైద్యులను నియమించక రోగులు వైద్యసేవలకు వెళ్ళే పరిస్థితే లేకపోగా ఈనియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి తొలుత 100 పడకల ప్రాంతీయ వైద్యశాలగా అప్‌గ్రేడ్ చేయించడంతో పాటు ఆయన ప్రతిపాదనలతో 150 పడకల జిల్లా వైద్యశాలగా రూపాంతరం చెందినా ఆమేరకు వైద్యసేవలు అందడం లేదని, ప్రభుత్వం పట్టించుకోవడవ లేదని సర్వత్రా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలుత 10 బెడ్‌ల హాస్పిటల్‌గా ఉండగా అప్పట్లో శాసనసభ్యులుగా ఉన్న డాక్టర్ బమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి 30పడకల హాస్పిల్‌గా మార్పించారు. అయితే నామ మాత్రంగా వైద్యులను నియమించడంతో ఈ హాస్పిటల్‌కు చికిత్సలకోసం అతితక్కువ మంది మాత్రమే వెళుతుండేవారు. కాగా ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరును మున్సిపాలిటీగా, రెవిన్యూ డివిజన్‌గా చేయడంతోపాటు 100పడకల ప్రాంతీయ వైద్యశాలను కూడా మంజూరు చేయించి దాదాపు 23కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయించగా భవనాలను కూడా నిర్మించారు. 2012లో మెట్టప్రాంతమైన ఆత్మకూరులో ప్రాంతీయ వైద్యశాలను ఏర్పాటు చేస్తే మరో మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గానికి ప్రయోజకరంగా ఉంటుందన్న ఆశయంతో ఏర్పాటు చేయించారు. ఈ రెండు నియోజకవర్గాల తోపాటు కడపజిల్లా బద్వేలు ప్రాంతం నుండి కూడా రోగులు ఇక్కడకే వైద్యసేవలకు వస్తుండేవారు. అత్యంత సౌకర్యవంతంగా అధునాత భవనాలు, వైద్యులకు, సిబ్బందికి క్వార్టర్లు కూడా నిర్మించగా కొందరు వైద్యనిపుణులను, సిబ్బందిని నియమించగా రోజుకు 450 పచిలుకు రోగులు వైద్య సేవలు పొందుతుండేవారు. అయితే అప్పట్లో 100 పడకల స్థాయికి తగ్గట్లుగా వైద్యులను, సిబ్బందిని నియమించలేదని పలువురు ఆవేదన చెందుతుండేవారు. 2014 లో అప్పటి కేంద్రమంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతులమీదుగా ఈ హాస్పిటల్‌ను ప్రారంభించారు. 2015లో అప్పటి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి కామినేని శ్రీనివాసరావు ఈ హాస్పిటల్‌కు విచ్చేసి కలెక్టర్ ఎం.జానకి ఆధ్వర్యంలో జరిగిన కమిటీ సమావేశంలో పాల్గని సమస్యలు తెలుసుకొని వెంటనే రాష్ట్ర డైరెక్టర్‌కు ఫోన్‌చేసి అతిత్వరలో పూర్తిగా వైద్యులను, సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా ఆనం రామనారాయణరెడ్డి అప్పటికే చేసిన ప్రతిపాదన మేరకు 2017లో 100 పడకల ప్రాంతీయ వైద్యశాలను 150 పడకల జిల్లా వైద్యశాలగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేశారు. కాగా జిల్లా వైద్యశాల స్థాయి వైద్యులను, సిబ్బందిని ఇప్పటికీ నియమించకపోగా ముఖ్యమైన వైద్యపరికరాలను కూడా సమకూర్చలేదు. ఇక్కడ హాస్పిటల్ సూపర్నెంట్‌గా పనిచేసిన డాక్టర్ ఎల్.చెన్నయ్య, ప్రస్థుత సూపర్నెంట్ డాక్టర్ శేషారత్నం, ఆర్‌ఎంవో డాక్టర్ ఉషాసుందరిలు హాస్పిటల్‌ను ప్రత్యేకశ్రద్ధతో నిర్వహిస్తూ ఉన్న వైద్యులు, సిబ్బందిద్వారానే ప్రజలకు వైద్య సేవలందించసాగారు. కానీ 150పడకల స్థాయి వైద్యులను, సిబ్బందిని ప్రభుత్వం నియమించకపోగా ప్రస్థుతం వైద్యులు, సిబ్బంది 136మంది ఉండాల్సి ఉండగా 72మంది మాత్రమే పనిచేస్తున్నారని, 64 ఖాళీలున్నాయని, జిల్లా హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ అయినా బెడ్‌లు గతంలో సమకూర్చిన 100మాత్రమే ఉండగా మిగతా 50బెడ్‌ను సరఫరా చేయలేదని గత ఏడాదివరకు చెబుతుండేవారు. హాస్పిటల్‌లో వైద్యుల, సిబ్బంది కొరతతో ప్రజలకు ఆశించిన, లక్ష్యం మేరకు ప్రజలకు వైద్యసేవలందడం లేదని సర్వత్రా చెబుతున్నారు. తాజాగా పరిస్థితి చూస్తే 26మంది వైద్య నిపుణులకు గాను 17మంది పని చేస్తుండగా 9మంది వైద్యనిపుణుల ఖాళీలున్నాయి. 20మంది మినిస్టీరియల్ సిబ్బందికిగాను 11మంది పనిచేస్తుండగా 9ఖాళీలున్నాయి. సివిల్‌సర్జన్ స్పెషలిస్టులు 10మందికిగాను 7మంది ఉండగా 3ఖాళీలున్నాయి. ఒక ఆర్‌ఎంవో పోస్టుకు



పూర్వ వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి కామినేని శ్రీనివాస్ సమావేశం (ఫైల్‌ఫోటో)

గాను ఆఒక్కరు ఉన్నారు. డిప్యుటి సివిల్ సర్జన్ పోస్టులు 5మందికి గాను ముగ్గురు పని చేస్తుండగా రెండు ఖాళీలున్నాయి. సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ పోస్టులు 11 పోస్టులకుగాను 7మంది పనిచేస్తున్నారు. నాలుగు ఖాళీలున్నాయి. ఒక స్టాఫ్‌నర్స్, రెండు డార్క్‌రూమ్ అసిస్టెంట్, ఒక ఆఫీస్ సూపర్నెంట్, మూడు జూనియర్ అసిస్టెంట్, రెండె సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలున్నాయి. ఇంతటి వైద్యుల. సిబ్బంది కొరత ఉండగా లక్ష్యం మేరకు వైద్యసేవలు లభించకపోగా ఎన్నిదపాలుగా మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళినా సిబ్బంది, వైద్యుల కొరత గురించి పట్టించుకోలేదు. ఈ హాస్పిటల్ లక్ష్యం దూరం కాగలదని, మనుగడ కష్టతరంగా మారనుందని, జిల్లా హాస్పిటల్ ఉన్నా అందుకు తగినట్లుగా వైద్యసేవలు లభించే పరిస్థితి లేదని సర్వత్రా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి వైద్యులు, సిబ్బందిని సమకూర్చాలని, వైద్యులను నియమించి వారు వచ్చి చేరేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అన్నీఉన్నా అల్లుడినోట్లో శని చందంగా ఈ హాస్పిటల్ మారకుండేలా ప్రభుత్వం శ్రద్ధ చూపాలని కోరుతున్నారు. గత ప్రభుత్వం ఆత్మకూరు జిల్లా వైద్యశాల పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంభించినందునే ఆందోళనకర పరిస్థితి ఏర్పడిరదని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో ఈ హాస్పిటల్‌ను మంజూరు చేయించి భవనాలు కూడా నిర్మింపజేసిన ఆనం రామనారాయణరెడ్డి ప్రస్థుతం ఆత్మకూరు శాసనసభ్యులుగా, రాష్ట్రమంత్రిగా ఉన్నారు. దాంతో మళ్ళీ అందరిలో ఆశలు రేకెత్తాయి. ఈహాస్పిటల్ దశమారనుందని భావిస్తున్నారు. ప్రస్థుతం ఉన్న వైద్యులు నిపుణులుగా ఉంటూ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందిస్తున్నారు. మిగతా వారిని కూడా నియమించి అవసరమైన పరికరాలను సమకూర్చాలని సర్వత్రా ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## మర్రిపాడు కార్యాలయాలకు పవన్ చిత్రపటం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గం మండల కేంద్రమైన మర్రిపాడు తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలకు ఆత్మకూర్ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ చేతుల మీదుగా జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాన్ని జనసేన ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి పవన్ కళ్యాణ్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. అతి తక్కువ కాలంలో జనసేన పార్టీ బలోపేతం అయిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉప ఇన్‌చార్జ్ డబ్బు కొట్టు నాగరాజు యాదవ్, మండల ఉపాధ్యక్షులు హజరత్ యూత్ అధ్యక్షులు నాగేష్, భాను, సురేంద్ర, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## జగ్గయ్యపేట ఎమ్మెల్యేను ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించి తటవర్తి రమేష్



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నూతన ఆర్యవైశ్య సంఘ కావలి పట్టణ అధ్యక్షునిగా ఎన్నికైన తట్టవర్తి రమేష్ సోమవారం ఆర్యవైశ్య ముద్దుబిడ్డ జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్యని ప్రేమపూర్వకంగా ఆగస్టు 18వ తేదీన ప్రమాణస్వీకారానికి రావలసిందిగా ఆహ్వానించారు. అనంతరం జగ్గయ్యపేట శాసనసభ్యుల్ని శాలువాతో సత్కరించిన తటవర్తి వాసు, ఆర్యవైశ్య సంఘ నాయకులు.

## మహిమలూరులో గురుపూర్ణిమ ఉత్సవాలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం మహిమలూరులోని శ్రీ షిరిడిసాయి నాధుని ఆలయంలో ఆదివారం గురుపూర్ణిమ సందర్భంగా బెస్త సంఘీయులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. జగద్గురు వేదవ్యా సభగవానుని జయంతి గురుపూర్ణిమ అని బెస్త సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్టుబోయిన సుబ్బరాయుడు తెలిపారు. మహిమలూరులోని వ్యాసంతతి బెస్తకులబంధువులు గురుపూర్ణిమ పండుగను ఘనంగా నిర్వహించుకున్నామని ఆయన పేర్కొన్నారు. బెస్త సంఘీయులందరూ పాల్గొన్నారని సుబ్బరాయుడు పేర్కొన్నారు.

## గ్రామాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత : ఎంపీడీఓ



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** గ్రామ పర్యావరణ పరిసరాలు శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి గ్రామస్తునికి ఉందని ఎంపీడీవో తాజ్ మష్రూర్ అన్నారు. అనంతసాగరం మండలంలోని ఇనగలూరు, వెంగంపల్లి, ఆమని చిరువెల్ల, పాతదేవరాయపల్లి బిట్ వన్, లింగంగుంట గ్రామాలలో సోమవారం గ్రామసభలు జరిగాయి. సర్పంచుల అధ్యక్షతన కార్యదర్శుల పర్యవేక్షణలో జరిగిన గ్రామసభలలో గ్రామాభివృద్ధి, పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. మంచినీటి వృధాను అరికట్టాలని, మరుగుదొడ్ల వాడకం చేపట్టాలని, లేనివారు దరఖాస్తు చేసుకోవాలని, ప్రస్తుతం పంచాయతీలలో చేపడుతున్న సర్వే తీరుపై ఆయన వివరించారు. ఇంటి ఆవాసాల వద్ద మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. పంచాయితీలో ప్రాథమిక అవసరాలను కార్యదర్శులు సమగ్రంగా చేపట్టాలని ఆయన సూచించారు. గ్రామంలోని అన్ని సమస్యలను ప్రస్తావించేందుకు చర్చించేందుకు గ్రామసభలు ఎంతో ఉపయోగకరం అని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.